# జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

చల్లా సత్యవతి, Matawan, NJ

కృష్ణమూర్తి మామయ్య వుత్తరంలోని సంగతులు చదివి శేఖర్ ఆలోచనలో పడ్డాడు. అమెరికానుండి త్వరలోనే స్వదేశానికి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. తన తండ్రి లక్ష్మీనారాయణమూర్తిగారు ప్రాణపదంగా కాపాడుకున్న కాకినాడలోని ఇల్లు శిథిలావస్థలో పడిందనీ, సాధ్యమైనంత త్వరలో స్వయంగా వచ్చి ఆ వ్యవహారం చూసుకోవడం మంచిదనీ మామయ్య హెచ్చరించాడు.

"అవును. నాలుగేళ్ళక్రితం నాన్న సంవత్సరీకాలకు అందరం వెళ్ళిరావడమే. అప్పటికే ఇల్లు బాగా పాడైంది. చాలాచోట్ల వర్షం కురుస్తోంది. చిన్నచిన్న రిపేర్లు అవీ మామయ్యే చేయిస్తున్నాడు. మామయ్య-అత్తయ్య పెద్దవాళ్ళయ్యారు. తొందరలో పిల్లల వద్దకు వెళ్ళాలనుకుంటున్నారట. అలాంటపుడు వారిని ఈ బాధ్యతనుండి తప్పించాలి. పక్కింటిలో అద్దెకుంటున్న శంకరం మాష్టారు నెలకొకసారి ఇల్లు శుభ్రం చేయించడం వలన కొంత నయం" అనుకొని శేఖర్ వెంటనే ఆయనకు తాము తొందరలో వస్తున్నట్లుగా వుత్తరం వ్రాసిపడేశాడు. ఈ విషయాలను చెల్లెళ్ళు శోభ, సుధలకు కూడా చెప్పి వారు కూడా వస్తే ముగ్గురం ఆలోచించి నిర్ణయించుకోవచ్చును అని సూచించాడు. ఇండియా వెళ్ళడానికి అందరూ సుముఖంగానే వున్నారు. శేఖర్ కొడుకు పదిహేను సంవత్సరాల అరుణ్‌కు సెలవలు.

'డాడీ, మీరు చిన్నప్పుడు చదువుకున్న స్కూలు, కాలేజీ అన్నీ చూస్తాను. తాతగారింటికి నేను కూడా వస్తాను' అంటూ ప్రయాణమయ్యాడు. శోభ కూతురు రూప, సుధ కూతురు ప్రియ కూడా తల్లులతో బయలుదేరారు.

ప్లాను ప్రకారం రెండు మూడు రోజుల తేడాతో కాకినాడకు చేరారు. కృష్ణమూర్తి, సుభద్రమ్మ వారిని ఆప్యాయంగా ఆహ్వానించారు. "నా ఉత్తరానికి విలువనిచ్చి మీరంతా రావడం చాలా బాగుంది.. మాకూ ఓపికలు తగ్గాయి. పిల్లలదగ్గరకు వెళ్ళిపోవాలనుకుంటున్నాము. మీరంతా చాలా దూరాలలో వున్నారు. ఇలాంటి వ్యవహారాలలో అనుభవం లేదు కదా! నేను పక్కన వుంటే సవ్యంగా జరుగుతుందని అలా వ్రాసాను."

"అవును మామయ్యా ఎలా చేస్తే బాగుంటుందో నువ్వే చెప్పాలి. నాన్న పోయినప్పటినుంచీ మీరే మాకు అన్ని విషయాలలోనూ పెద్దదిక్కుగా వున్నారు" శేఖర్ అన్నాడు.

"ఒక పద్ధతి అమ్మకానికి పెట్టడం. ఈవూళ్ళో కూడా పాత ఇళ్ళన్నీ పడగొట్టి అపార్ట్ మెంట్లే కడుతున్నారు. అంచేత ధర బాగానే వస్తుంది. అలాకాక ఇల్లు ఉంచుకోవాలంటే చాలా పని చేయించాలి. ఈ రోజుల్లో లక్షదాకా ఖర్చు అవుతుంది. అద్దెకిస్తే ఇల్లు ఇంకా పాడవుతుంది. బాగా ఆలోచించి నిర్ణయానికి వద్దాం". శేఖర్ "అందుకే చెల్లెళ్ళను రమ్మని వ్రాసాను. ఈ ఇల్లు మాముగ్గురికీ చెందాలని నాన్న కోరిక. అందరం ఆలోచిద్దాం" అన్నాడు.

సాయంకాలం వరకూ ఖబుర్లతో గడిపి, అందరూ గాంధీనగరంలోని పాత యింటికి బయలుదేరారు. పిల్లలు ముగ్గురూ సిటీలలో పెరుగుతున్న వారే. ఆవూళ్ళోని దృశ్యాలన్నీ ఆశ్చర్యంగా వున్నాయి. దారిపొడుగునా చిన్నచిన్న పాక హోటళ్ళు, దుకాణాలు, వీధుల్లో అమ్మే పళ్ళు, పూవులు సరదాగా చూసుకుంటూ నడుస్తున్నారు. పదేళ్ళ రూప "నాకు మా బాంబే కంటే ఈ ఊరే బాగుంది. వీధులన్నీ విశాలంగా, లైన్లగా వున్నాయి. ప్రతి ఇంటిముందు పెద్దపెద్ద చెట్లున్నాయి చక్కగా" కళ్ళుతిప్పుకుంటూ చెప్తోంది. హైదరాబాదులో పెరుగుతున్న ప్రియకు కూడా కాకినాడ బాగా నచ్చింది. "మావూళ్ళో సాయంత్రంవేళ అసలు నడవలేము. స్కూటర్లు, ఆటోలను తప్పించుకోవడం చాలా కష్టం"అంది.

అమెరికాలో పుట్టిపెరుగుతున్న 'అరుణ్' మాట్లాడకుండా అన్ని దృశ్యాలు ఆశ్చర్యంతో చూస్తున్నాడు. సైకిల్ రిక్షాలలో సుమారు పదిమంది పిల్లలు ఇరుక్కుని స్కూల్స్ నుంచి వస్తున్నారు. రిక్షావాళ్ళు ఎంతో రిస్కు తీసుకొని, చాలా జాగ్రత్తగా తొక్కుతున్నారు. కార్లు, స్కూటర్లు నడిపేవారు అసలు రూల్స్ పాటించరేమో అనిపించింది. ఇక్కడే పెరిగిన పెద్దవారికివేమీ వింతకాదు. మామూలుగా ఖబుర్లు చెప్పుకుంటున్నారు.

ఇల్లు దగ్గరయ్యాక తల్లితండ్రుల జ్ఞాపకాలవలన వారి మనసులు బరువెక్కాయి. ఇంటిముందు పెద్ద గేటు తెరవగానే బాగా ఎండిపోయిన బోగన్ విలియా చెట్టు పండుటాకులతో, పొడుగ్గావున్న సంపెంగ చెట్టు కన్నీళ్ళతో పలకరించినట్లుగా అనిపించింది. ఇంటిలోపల హాలులోపలికి అడుగుపెట్టారు. శంకరం మాష్టారు ఏర్పాటు చేసిన పనివాళ్ళు కొంతవరకు శుభ్రంచేసి చాపలు హాల్లో పరిచారు. కానీ ఎవ్వరూ కూర్చోకుండా ఇల్లంతనూ ఆర్తితో పరికించసాగారు. ఆ ఇంట్లో ప్రతి అంగుళం వారికి పరిచయమే. ప్రతీ గదీ ఎన్నో కథలు చెప్తోంది.

'ఇక్కడ బంధువులొస్తే పడుకునేవారు. ఈ గదిలో పరీక్షలకు చదువుకునేవారం.' అంటూ ఎన్నో స్మృతులు పలకరించాయి.

మామయ్య, అత్తయ్యలకు కూడా ఎన్నో జ్ఞాపకాలు "ఈ ఇంటిని మీ అమ్మా నాన్నా దేవాలయంలాగా చూసుకునేవారు. మీముగ్గరి పెళ్ళిళ్ళు, ఇంకా అనేక శుభకార్యాలు ఈ పెరట్లో పందిరిలో జరిగాయి. మేము కూడా తరచు వస్తుండేవాళ్ళం"

'అవునత్తయ్యా మాకు తెలుసు. ఈ ఊరు కదలక్కరలేకుండానే కాలేజీ చదువులు పూర్తయ్యాయి. చిన్నప్పుడు మా ఫ్రెండ్స్ అందరూ మన ఇంటికే వచ్చేవారు. అందరం సాయంత్రాలు ఆడుకునేవారం" సుధ మాటలకు శోభ అడ్డువచ్చి "వారానికి మూడురోజులు మనకి సంగీత పాఠాలు వుండేవి కదా! మాష్టారు వస్తే మనకి ఎంత కోపం వచ్చేదో" అని నవ్వింది.

శేఖర్ అందుకున్నాడు "అవును తల్లీ! నాకు ఇంకా ఎక్కువ కోపం వచ్చేది నాకోసం వచ్చే ఫ్రెండ్స్ మీ సంగీతసాధనలతో పారిపోతుండేవారు. గుర్తుందా?". అంతా నవ్వేశారు.

"శేఖర్ మీనాన్నగారు ఏటా ఇంటికి ఎన్నో పనులు చేయించి సున్నాలు వేయించేవారు. నువ్వు ఆ మేస్త్రీల వెనకాలే వుండి అజమాయిషీ చేసేవాడివి, గుర్తుందా? మీదేశంలో కూడా అలాగే చేస్తూంటావా!!" అంటూ పరిహాసం చేసింది అత్తయ్య.

శేఖర్ కాస్త సిగ్గుగా తలవంచుకున్నాడు.

"ఎగ్జాట్లీ గ్రాండ్ మా. అక్కడ పనివాళ్ళు చాలా కాస్ట్లీ కదా. అందుకని ఇంటిపనులు చాలావరకూ డాడీయే చేస్తారు. ఈ మధ్యనే మా కొత్త ఇంటికి ఎలక్ట్రిక్ పనులన్నీ మేమిద్దరమే చేశాము" అరుణ్ కాస్త గర్వంగా అంటే "అయితే మరీ మంచిది. మీతాతయ్య ఇంట్లో లైట్లు వెలగడం లేదుకదా, అరుణ్ వెలిగింపజేస్తాడు".

పనివాళ్ళు అటకమీదనున్న పాతసామానంతా దించారు. అంతా చుట్టూ చేరారు. పెద్దపెద్ద గంగాళాలు, బిందెలు, పాడైన ఫాన్లూ ఇంకా ఎన్నో వున్నాయి. శోభ, సుధ దేవుని మందిరం శుభ్రం చేసి పూజగదిలో పెట్టారు. వాళ్ళమ్మ వున్నపుడు పండగలు, పూజలు గుర్తు కొచ్చాయి.

"వినాయకచవితి నాడు ఈ మందిరాన్ని ఎంతో అందంగా అలంకరించేవారం. అప్పటికప్పుడు బజారుకెళ్ళి రంగు కాగితాలు తెచ్చి, తోరణాలు కట్టేవారం. మన పక్కింటి అమ్మాయిలు సరసు, ఉమ కూడా మాతోనే వుండి సహాయం చేసేవారు. మన పెరట్లో ఆరు రకాల మందార చెట్లుండేవి. అమ్మమ్మ ప్రతి రోజూ మందార, నందివర్ధనం పూలతో పూజ చేసేది."

వీళ్ళిలాగ అప్పటి సంగతులు మాట్లాడుకుంటుంటే శేఖర్ వాళ్ళ నాన్నగారి చెక్క బీరువా తెరిచి పరిశీలించసాగాడు. ఏభై సంవత్సరాలనాటి డైరీలు, పెళ్ళిళ్ళు, ఇతర శుభకార్యాల వివరాలున్నవి కార్డు, పెదతాతగారు వ్రాసిన వంశవృక్షం అన్నీ ఎంతో జాగ్రత్తగా వుంచారు. ఒక పెట్టెలో తాతగారి జేబు గడియారం కీ ఇస్తే చక్కగా పని చేస్తోంది.

ఇంకొక చిన్న దంతం పెట్టెపై "Miracle Rice" అని వుంది. శేఖర్ తెరవగానే అందరూ చుట్టూ చేరి ఆశ్చర్యంగా ఆ బియ్యపుగింజను భూతద్దం సహాయంతో పరిశీలించారు. పిల్లలు "వండర్‌ఫుల్ మార్వెలెస్" అంటూ గెంతసాగారు.

అరుణ్ "దిస్ యీజ్ రియల్లీ ఎ గ్రేట్ వండర్ డాడీ. ఇంత చిన్న రైస్ మీద ఎయిటీ ఫోర్ (84) లెటర్స్ వ్రాసిన ఆ ఆర్టిస్టు వెరీవెరీ గ్రేట్! అతనికి హేట్సాఫ్! ఇది తీసికెళ్ళి మా ఫ్రెండ్స్‌కి చూపిస్తాను".

"మీతాతగారి సేవలకు మెచ్చి గవర్నమెంటు బిరుదు ప్రదానం చేసిన సందర్భంలో ఒకానొక గొప్పఆర్టిస్టు దానిని బహూకరించారు" అనిఆ కథంతా చెప్పాడు. అప్పటి సంఘటనలు తలుచుకుంటూ రాత్రివరకూ గడిపి, కాకినాడలో ప్రసిద్ధిగాంచిన సుబ్బయ్య హోటలులో తృప్తిగా ఆంధ్ర భోజనాలు చేసివచ్చి పడుకున్నారు.

మరునాడింకా తెల్లవారకుండానే పిల్లలు లేచి, పెరడంతా తిరగడం మొదలుపెట్టారు. పొడుగ్గా ఠీవిగా నిలబడిన కొబ్బరిచెట్ల దగ్గరగా వెళ్ళి కాయలు లెక్కపెట్టారు. అరటి ఆకులతో కాస్సేపు ఆడుకున్నారు. గోడ ప్రక్కగా మామిడి, రాస ఉసిరి చెట్లు వారిని ఆకర్షించాయి. రూప ఉసిరికాయలను ఏరసాగింది. ప్రియ మామిడి చెట్టున వ్రేలాడుతున్న పిందెలు కర్రతో కొట్టడానికి ప్రయత్నిస్తోంది. వెనగ్గా వున్న బాదం చెట్టు ఎర్రగా పండిన ఆకులతో పళ్ళతో అందమైన గొడుగులాగ వుంది. సుధ లోపలికెళ్ళి కెమేరా తెచ్చి ఆ చెట్టుకు ఫొటోలు తీసింది. శోభ, సుధ కూడా వీరి మాటలు విని, వచ్చి సిమెంటు బెంచిమీద కూర్చుని "ఈ ఆకులతో బొమ్మలకొలువు పేరంటాలలో ప్రసాదాలు పెట్టి ఇచ్చేవారం. బాదం కాయలలోని పప్పు చాలా రుచిగా వుంటుంది" అంటూ రెండు కాయలు ఏరి తెచ్చింది సుధ.

శేఖర్ కూడా సంభాషణలో జేరి "అన్ని చెట్లకంటే తాతయ్యకి, అమ్మమ్మకి ఈ పెద్ద వేపచెట్టంటే చాలా ఇష్టం. ఈ చెట్టుగాలి శరీరానికి చాలా ఆరోగ్యమట. ఉగాది పండుగప్పుడు ఎంతోమంది వచ్చి వేపపూతను తీసుకొని వెళ్ళేవారు. ఈ చెట్టు క్రిందనే భోగి పండుగనాడు తెల్లవారగట్ల భోగిమంట వేసి చలి కాచుకునేవారం. చుట్టూ కూర్చుని ఫ్రెండ్స్ తో సరదాగా గడిపేవాళ్ళం".

శేఖర్ వాళ్ళను వెనుకవైపు రేకుల షెడ్డులోకి తీసికెళ్ళి "ఇది మా పెట్ హవుసు" అన్నాడు. పిల్లలాశ్చర్యపడి, "ఇంత పెద్దదా! ఎన్ని పెట్స్‌ని పెంచేవారు?ఎన్ని కుక్కలు పిల్లులు వుండేవి మామయ్యా మీ ఇంట్లో?" అన్నారు.

"మా పెట్ యానిమల్స్ చాలా పెద్దవి. కుక్కలూ పిల్లులూ కాదు. తెలుసా. cows & calves ఈ షెడ్డులో వుండేవి. ప్రతి రోజూ Milkman వచ్చి ఆవుల పాలు పితికి మాకిచ్చేవాడు. బుజ్జి ఆవు దూడలు ఎంతో ముద్దుగా గెంతులు వేస్తుండేవి. మాఆవుల పాలతోనే అమ్మమ్మ కాఫీలు, పెరుగు తయారు చేసేది".

"మీ లైఫ్ ఎంతో థ్రిల్లింగా వుండేది డాడీ. మాకు కూడా కొన్నాళ్ళు ఇక్కడ వుండాలనివుంది. అక్కడ పెద్ద Trench లాంటిది వుంది అదేమిటి డాడీ?" కొడుకు ప్రశ్నకు

"రండి దగ్గరగా వెళ్ళి చూద్దాం. అది ఒక పెద్ద cooking range అనుకోండి. పెళ్ళిళ్ళకు కావలిసిన పెద్దపెద్ద వంటలను ఈ 'గాడి పొయ్యిల' మీదే చేసేవారు. కర్రలను దీనిలో పెట్టి మంటపెట్టి, ఆమంటలమీద తయారయ్యేవి" పిల్లలకు సరిగ్గా అర్థమవక మాట్లాడలేదు.

ఇంతలో వీధిలో ఎదో అమ్ముతున్నట్లు కేక వినబడగానే సుధ పరుగున వెళ్ళి, కొబ్బరికాయలను దింపే మనిషిని తీసికొని వచ్చింది. అతన్నీ, ఆ గెటప్‌ని పిల్లలు కన్నార్పకుండా చూడసాగారు.

అందరూ చూస్తుండగానే అంత పెద్ద కొబ్బరి చెట్టునూ అవలీలగా ఎక్కి పెద్దపెద్ద కాయలను "ధన్ ధన్" మంటూ క్రిందకు విసిరాడు. పిల్లలు ఆశ్చర్యంతోనూ సంబరంగానూ గట్టిగా చప్పట్లు కొట్టి అతన్ని అభినందించారు. అతనే కొన్ని లేత బోండాలను కొట్టి అందరికీ అందించాడు. తియ్యని కొబ్బరి నీళ్ళను తృప్తిగా తాగారు. సుధ ఇచ్చిన డబ్బు కాక, అరుణ్ తన పోకెట్టు మనీ

నుండి వంద రూపాయల నోటుని కూడా అతనికి బహుమతిగా ఇచ్చి, షేక్ హేండు యిచ్చాడు. అతను బ్రహ్మానందపడి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ సాయం కాలం శంకరం మాష్టారు, భార్య వర్ధనమ్మగారు వచ్చారు. శేఖర్ వారిని గౌరవంగా తీసికొని వచ్చి, యోగక్షేమాలను తెలిసికొన్నాడు. వారు కూడా పేరుపేరునా ఆప్యాయంగా పలకరించి, చిన్న తనంలో తనవద్ద చదివి ఎంతో అభివృద్ధిచెంది మంచి పదవులలో వుంటున్నందుకు చాలా సంతోషించి "శేఖర్, నీ స్వయంకృషితో అమెరికా వెళ్ళి కంప్యూటరు ఇంజనీరుగా రాణించడం మాకందరికీ గర్వకారణం. అక్కడ కూడా ప్రవాసాంధ్రులకెన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు అభినందనలు" అన్నారు.

వారంతా కలసి ఆ వూరి విశేషాలు, తెలిసినవారి విశేషాలు కాసేపు మాట్లాడుకున్నాక, కాస్త సంసయిస్తూనే మాష్టారు అన్నారు, "మీమామయ్య ఇంటిని అమ్మడంగాని, అద్దెకివ్వడం గాని చేస్తారని చెప్పారు. . . . ఏ కారణంవల్లనైనా అమ్మకం జరగకపోతే, మాకిస్తే సంతోషిస్తాను. ఈ మధ్య చాలా మంది ట్యూషన్స్ చెప్పమంటూ అడుగుతున్నారు. మాఇల్లు నీకు తెలుసు కదా! చాలా ఇరుకు. ఈ హాలు చాలా విశాలంగా వుంది. చదువుకునే పిల్లలకు చాలా సదుపాయంగా వుంటుంది. ఎక్కువ అద్దె ఇచ్చుకోలేను కాని, ఇంటిని మీనాన్నగారుంచినట్లుగానే శుభ్రంగా చూడగలము. మీకు అవకాశం లేకపోతే ఫరవాలేదు. నేను ఏమీ అనుకోను."

శేఖర్ మాష్టారి చేతులు పట్టుకుని "మీ ప్రతిపాదనను గురించి తప్పక చెల్లెళ్ళతో ఆలోచించి త్వరలోనే మీకు చెప్తాను" అన్నాడు.

ఇంతలో శోభ మూడు గ్లాసులతో పళ్ళరసం తెచ్చి అందరికీ ఇచ్చింది. మాష్టారు, భార్య సెలవు తీసుకున్నారు.

కృష్ణమూర్తిగారు హాలులో అడుగుపెట్టేసరికిఅంతా సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, పిల్లలు నవ్వుకుంటూ వున్నారు.

"అన్నా చెల్లెళ్ళు పాత ఇంటిని చూసుకుని మురిసిపోతున్నారా. ఏదైనా నిర్ణయానికి వచ్చారా? ఇల్లు కొనుక్కొనే ఉద్దేశ్యంతో రేపు ఇద్దరు కంట్రాక్టర్లు వస్తున్నారు. ప్రస్థుతం అపార్టుమెంట్లకి చాలా డిమాండు వుంది. ధర కూడా బాగానే వస్తుంది. కాని ఎంతో జయప్రదమైన ఈ ఇల్లూ, ఈ ఊరూ కూడా దూరమౌతాయి. బాగా ఖర్చు పెట్టి బాగు చేయించి అద్దెకివ్వవచ్చును. ఇల్లు పాడవుతుంది. ఏదో ఒకటి మాత్రం త్వరలో చేయాలి" అన్నారు. ముగ్గురూ మౌనంగా వుండిపోయారు.

"అయితే మామయ్యా, ఇల్లు కొనుక్కున్నవాళ్ళు వెంటనే ఇంత బాగున్నదానిని పడగొట్టేస్తారా?" సుధ అమాయకమైన ప్రశ్నకు కృష్ణమూర్తిగారికినవ్వు వచ్చింది. "అవునమ్మా. అంతే చేస్తారు. మనం అమ్మేశాక పడగొట్టి వారికిష్టమైనట్లుగా అపార్టుమెంట్లకు ప్లాన్లు వేసుకుంటారు".

ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

ఈ సంభాషణను వింటున్న పిల్లలు ముగ్గురూ వచ్చేశారు.

"నో, నో డాడీ. మా గ్రాండ్‌పా మనకోసమని ఎంతో కష్టపడి కట్టించిన యింటిని అమ్మడం మాకు అసలు ఇష్టంలేదు. ప్లీజ్, డోంట్ థింక్ ఆఫ్ సెల్లింగ్ ద హౌస్" అరుణ్ మాటలకు వంత పలుకుతూ రూప, ప్రియ కూడా "నో,నో. డోంట్ సెల్. మేమొప్పుకోం" అంటూ నినాదాలు చేశారు. పెద్దవారు ఒకరిముఖాలొకరు చూసుకున్నారు. "సరే, సరే. మీ కోరిక ప్రకారం అమ్మకం లేదు. మీరు ముగ్గురూ దగ్గరుండి బాగు చేయిస్తారా? ఆమాట చెప్పండి ముందు. మేము ముగ్గురం మాత్రం మళ్ళీ ఆదివారం నాడు బయలుదేరుతున్నాం".

పిల్లలకేమీ తోచక దిక్కులు చూడసాగారు.

శోభ, సుధ రంగంలోకి వచ్చారు. ఆముందు రోజు శంకరం మాష్టారి అభ్యర్ధన జ్ఞాపకం చేసి "మాష్టారు చాలా మంచివారు. మన శ్రేయోభిలాషులు. వారికిల్లు యిస్తే మన సమస్య చాలావరకు పరిష్కారమవుతుంది. మనం తగిన డబ్బు అమిరిస్తే, యింటిపనులు ఆయనే చేయించగలరు. పైగా వారికి కూడా సదుపాయంకదా! మనింట్లో పదిమంది పిల్లలు విద్యాలాభం పొందితే మనకే మంచిది. మనపిల్లలకు శ్రేయస్సు కలుగుతుందని మానమ్మకం. ఎక్కడున్నా అమ్మా, నాన్నా సంతోషిస్తారు. అంతేకాదు, 'బాలవాక్యం బ్రహ్మవాక్యం' అంటారు కదా, పిల్లలు చెప్పినట్లే చేద్దాం అన్నయ్యా" అక్క చెల్లెళ్ళు కాస్త ఆవేశంగానే మాట్లాడారు. శేఖర్ నవ్వుతూ అందరికేసి చూసి, 'మీఅందరికీ ఇంటిమీద ప్రేమ వుంటే, నేనేనా తక్కువ? ఇప్పుడేమాష్టారింటికివెళ్ళి ముందుగా నేనే చెప్పివస్తాను". అందరూ ముక్త కంఠంతో, "థ్యాంకూ, థ్యాంకూ" అని అరిచారు.

ఎంతో పెద్ద సమస్య అనుకున్నది తేలిగ్గా పరిష్కారమైనందుకు వారి మనసులు తేలికపడి ఆనందంగా విహరించసాగాయి. ఆ మిగిలిన వారం రోజులు వారికిష్టమైనట్లు స్వేచ్ఛగా తిరగాలనుకున్నారు. ఒకరోజు టాక్సీలో ఊరంతా చుట్టి, షాపింగులు చేశారు. వారికి, పిల్లలకు నచ్చిన బట్టలు, పుస్తకాలను కొనుక్కున్నారు. బంధుమిత్రుల ఇళ్ళకువెళ్ళి విందు భోజనాలారగించారు.

పిల్లల కోరిక ప్రకారం బీచ్, పార్కులు తిరిగారు. సూర్యకళామందిరంలో జరుగుతున్న గానకచేరీ విన్నారు. రెండు తెలుగు సినిమాలు చూశారు. ఆఖరికి కోటయ్య కాకినాడ కాజాలు కూడా విడిచిపెట్టలేదు. త్రిపురసుందరీ దేవీ గుడిలో పూజ చేయించుకున్నారు.

మామయ్యకు, అత్తయ్యకు వీడ్కోలు చెప్పడానికి వెళ్ళి, వారిచ్చిన కొత్త బట్టలు ధరించారు. చివరగా మాష్టారింటికి వెళ్ళి, అవసరమైన డబ్బు ఏర్పాటు చేసి, అన్ని విషయాలు మాట్లాడుకుని ఆ దంపతులకు పాదాభివందనం చేశారు. మాష్టారు

"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపిగరీయసీ - శ్రీరామ చంద్రుడు చెప్పిన ఈ సూక్తిని సర్వదా గుర్తుంచుకొని తదనుగుణంగా మీరు నడచుకోవాలనీ, అందుకు తగిన శక్తి సామర్ధ్యాలు, మంచిమనసులనూ ప్రసాదించాలని దేవుని ప్రార్థిస్తున్నాను. మీకు శుభం కలుగుతుంది" అని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఓం తత్సత్. సర్వేజనా సుఖినోభవన్తు.